రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా: సీఎం విజయ్ 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

నేటి వెలుగు తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో | జిల్లా స్టాఫ్
డివిజన్ అసెంబ్లీ ఇంచార్జిలు | మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్ నవీన్ కుమార్ గౌడ్

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 114 | పేజీలు : 4 | ఆగష్టు 8 శనివారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 114 | PAGES:4 | SATURDAY AUGUST 8 2026 | Rs. 4:00

# వేతనాలకు వెతలే.. హామీలకు తూట్లే!




## నెలల తరబడి జీతాల కోసం వేలాది మంది ఎదురుచూపులు

1. వీబీజీ రామ్‌జీ పథకంలో 13 వేల మందికి రెండు నెలలుగా వేతనాల్లేవు
2. ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు నాలుగు నెలలుగా జీతాలు బంద్
3. సమగ్ర శిక్షలో 18 వేల మందికిపైగా ఉద్యోగులకు వేతన కష్టాలు
4. వేతనాలు పెంచుతామన్న హామీ ఏమైంది?
5. పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

**జీతం మా హక్కు.. దయ చేసి వెంటనే విడుదల చేయండి!**

వేలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నది. ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా, జీవోలు జారీచేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అది అమలుకావడం లేదు. నెలల తరబడి జీతాలు అందక చిరు ఉద్యోగులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా పనిచేస్తున్న సుమారు 13 వేల మంది చిరు ఉద్యోగులకు 2 నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రతినెలా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ జీవోలు ఉన్నప్పటికీ వాటి అమలు మాత్రం శూన్యంగా మారిందని ఉద్యోగులు మండిపడుతున్నారు.

(మిగతా 2వ పేజీలో..)

## బోనాల పండగ: సైబరాబాద్ పరిధిలో మద్యం దుకాణాలు బంద్

- బోనాల పండగ సందర్భంగా సైబరాబాద్‌లో మద్యం దుకాణాల మూసివేత
- ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలపై నిషేధం
- ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ప్రకటన
- శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయమన్న పోలీసులు

హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాల నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీలక ఆదేశాలు వెలువడ్డాయి. పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా, ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ శుక్రవారం నాడు

(మిగతా 2వ పేజీలో..)



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్




జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను

(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీలో వర్ష బీభత్సం.. స్తంభించిన జనజీవనం

- ఢిల్లీ, ఎన్‌సీఆర్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ప్రధాన రహదారులపై భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్
- పలుచోట్ల ఇళ్లు కూలి, చెట్లు విరిగిపడిన ఘటనలు
- రాజధాని ప్రాంతానికి ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ



దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శుక్రవారం కుండపోత వర్షం ముంచెత్తింది. ఈ భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో

(మిగతా 2వ పేజీలో..)

## భయపడొద్దు, నేనున్నాను: టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## భయపడొద్దు, నేనున్నాను: టీఎంసీ–శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బోనాల పండగ: సైబరాబాద్ పరిధిలో మద్యం దుకాణాలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఆగస్టు 9 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమల్లో ఉంటాయి. కుకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు మరియు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అయితే, స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాల దృష్ట్యా ఈ ఆంక్షలు విధించారు. ఇప్పటికే హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా ఇటువంటి ఆంక్షలే అమలులో ఉన్నాయి.

# ఢిల్లీలో వర్ష బీభత్సం.. స్తంభించిన జనజీవనం

(మొదటి పేజీ తరువాయి)

జనజీవనం అస్తవ్యస్తమైంది. దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీ–బదర్‌పూర్ రోడ్డులో పరిస్థితి పూర్తి జలమయంగా మారింది. ఇక్కడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సమీపంలో సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో వాహనాలు నీటిలో చిక్కుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఓఖ్లా మోర్, ఖాన్‌పూర్, సంగమ్ విహార్ వంటి ప్రాంతాలు కూడా నీట మునిగాయి. నీటిలో చిక్కుకున్న వాహనాలను బయటకు తీసేందుకు ఎయిర్ ఫోర్స్ ట్రక్కులు సహాయక చర్యలు చేపట్టాయి. ఐటీఓ, పటేల్ రోడ్, రోహతక్ రోడ్, ఢిల్లీ–జైపూర్ హైవే వంటి మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ వర్షాల ధాటికి తొమ్మిది ఇళ్లు కూలిపోయాయని, 16 ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ విభాగం వెల్లడించింది. ఒక ఇంటిపై చెట్టు కూలడంతో లోపల చిక్కుకున్న ముగ్గురు మహిళలను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. శుక్రవారం ఉదయం నాటికి సఫ్దర్‌జంగ్‌లో 59.2 మి.మీ, లోధి రోడ్డులో 60.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫరీదాబాద్‌లో రికార్డు స్థాయిలో 119.4 మి.మీ వర్షపాతం కురిసింది. ఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడాలో నీటితో నిండిన అండర్‌పాస్‌లో ఒక అంబులెన్స్ అరగంటకు పైగా చిక్కుకుపోయింది. గురుగ్రామ్‌లోని సివిల్ హాస్పిటల్ బేస్‌మెంట్‌లోకి వర్షపు నీరు చేరడంతో వైద్య సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు, భారత వాతావరణ శాఖ ఈ ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం రోజంతా భారీ వర్షాలు కొనసాగుతాయని, శనివారం నుంచి వర్ష తీవ్రత తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.

# వేతనాలకు వెతలే.. హామీలకు తూట్లే!

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల వేతనాల కోసం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపినా రూపాయి కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,579 మంది ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. ఏప్రిల్ నెల నుంచి వరుసగా నాలుగు నెలలుగా వారికి జీతాలు అందలేదు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల పరిస్థితి కూడా అదే పరిస్థితి. ఆగస్టు ఎనిమిదో తారీఖు వచ్చినా జూలై నెల వేతనం అందలేదు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, బోధన బోధనేతర సిబ్బంది, రిసోర్స్‌పర్సన్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కార్యాలయ ఉద్యోగులు కలిపి సుమారు 18 వేల మందికిపైగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

టీపీసీసీ హోదాలో హామీలు

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచుతామని స్వయంగా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉద్యోగులు గుర్తుచేస్తున్నారు. సచివాలయానికి పిలిపించి గౌరవంగా మాట్లాడిన సీఎం, ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా, జూన్ నెల జీతాలు కూడా పదో తేదీ తర్వాతే ఖాతాల్లో జమయ్యాయని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి మరింత దిగజారి నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉండటం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

# రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా: సీఎం విజయ్

చెన్నై: తమిళనాడు సీఎం విజయ్ ఇవాళ రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. కావేరి జల వివాదం నేపథ్యంలో.. తమిళనాడు ప్రయోజనాల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరి అంశంలో రాజకీయం చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. మేకదాతు డ్యామ్ అంశంలో రాష్ట్రం తమ హక్కులను ఎప్పటికీ వదులుకోదన్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. కావేరి జల వివాదంపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. కానీ మేకదాతు డ్యామ్ అంశంలో కర్నాటక సర్కారు మాత్రం దూసుకెళ్తున్నట్లు చెప్పారు. టీవీకే సర్కారుపై వస్తున్న విమర్శలకు విజయ్ కౌంటర్ ఇచ్చారు. తమిళనాడు జీవాధారం కావేరి నది అన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. తమిళనాడు జలహక్కుల కోసం కావేరి అంశంలో కర్నాటక సర్కారుతో చర్చలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం విజయ్ అన్నారు. అసెంబ్లీ పాస్ చేసిన తీర్మానాన్ని ప్రధాని మోదీకి పంపామని, మేకదాతు అంశంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో తీర్మానాన్ని సపోర్టు చేశారన్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి కూడా లేఖ రాసినట్లు విజయ్



తెలిపారు. కావేరి అంశంలో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసినట్లు చెప్పారు. 1969 నుంచి కర్నాటక డ్యామ్ ప్రాజెక్టుల అంశంలో తమిళనాడు చర్చలు నిర్వహిస్తోందన్నారు. కావేరి జల వివాదాన్ని పరిష్కరించేందుకు కర్నాటక సీఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు. దీని కోసం బెంగుళూరు కూడా వెళ్లనున్నట్లు సీఎం విజయ్ చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు శత్రు దేశాలు కూడా చర్చలు నిర్వహిస్తాయని, పక్క రాష్ట్రంతో మాట్లాడాలని నిర్ణయించానని, బెంగుళూరులో అవమానిస్తే ఏం చేస్తారని ప్రతిపక్షాలు అంటున్నాయని, అయితే తమిళనాడు ప్రజల కోసం అవమానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు విజయ్ తెలిపారు.

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

### రోడ్ల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఉన్నత స్థాయి సమీక్ష

### కాంట్రాక్టర్ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్న కోమటిరెడ్డి

### కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరిక

రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.



# చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి





**చౌటుప్పల్ పట్టణం ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచుల గ్రామాలకు నిధులు విడుదల చేయకుండా రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలు ఎన్నుకున్న సర్పంచుల పట్ల రాజకీయ వివక్ష చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను ఎలాంటి రాజకీయ భేదాభిప్రాయాలు లేకుండా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచుల గ్రామాలకు నిధులు నిలిపివేయడం ద్వారా గ్రామీణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని, ప్రజల సంక్షేమం విషయంలో రాజకీయాలు చేయడం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. నిధులు విడుదలయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "గ్రామాల అభివృద్ధిపై వివక్షను సహించం... నిధులు విడుదల చేసే వరకు పోరాటం ఆగదు!" అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, దూడల బిక్షం, వీరా రెడ్డి, జక్కల రాజు యాదవ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పోతపాక లింగస్వామి, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, అశోక్, కల్పన యాదవ్, గిరి, సతీష్ యాదవ్, రమణగోని శంకర్, చిరంజీవి, సురేష్, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాసనసభ ఆవరణలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఘనంగా ఆశాడ మాసం బోనాల పండుగ





**హైదరాబాద్ ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

లెజిస్లేటివ్ సెక్రటేరియట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల ఉత్సవాలలో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ , శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు మరియు కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు ముందుగా లెజిస్లేటివ్ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ శాంతులతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని చైర్మన్ , స్పీకర్ ఆకాంక్షించారు.

# సాగర్‌లో డెడ్ స్టోరేజీ.. వరి వేస్తే నష్టమే!





**నల్గొండ జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

నల్గొండ జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ కి చేరుకున్నందున, ఇకపై వర్షాలు వచ్చే అవకాశం లేనందున, ప్రాజెక్టు కింది ఆయకట్టు రైతులు ఎట్టి పరిస్థితులలో వరివేసి నష్టపోవద్దని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు కోరారు. శుక్రవారం హైదరాబాద్ నుండి మంత్రులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్ నినో పరిస్థితులు, ఆరుతడి పంటల సాగు,పౌర సరఫరాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్ నినో పై సమీక్ష సందర్భంగా నల్గొండ జిల్లా లోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు లోని నీటి పరిస్థితిపై మంత్రులు మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ లో ఉందని, ప్రస్తుత వ్యవసాయ సీజన్ అయిపోతున్నందున కమాండ్ ఏరియా రైతులందరూ వరి పంట వేసేందుకు ఎదురు చూడకుండా, వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పారు. వరి వేసుకున్నట్లయితే తీవ్రంగా నష్టపోతారని తెలియజేశారు. అందువలన తక్షణమే ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్లు రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తక్షణమే జిల్లాస్థాయి నీటిపారుదల సలహా సంఘ (ఐ ఏబీ) సమావేశాలను నిర్వహించి వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలన్నారు. వరి వేసుకుంటే ఇబ్బందులు పడతారన్న స్పష్టమైన వివరణను రైతులకు తెలియజేయాలన్నారు. .వరి స్థానంలో అరుతడి పంటలు వేసుకోవాలని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వ్యవసాయ, ఉద్యాన ,ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ని రైతులు వరి స్థానంలో వేసే అరుతడి పంటలను నిర్ణయించి వివరాలు తీసుకోవాలని, ప్రభుత్వం ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలు ఎరువులను ఇస్తుందని, అందువల్ల ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేసి ఏఈఓ లు మండలాల వారిగా వారం రోజుల్లో నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీనియర్ అధికారులు హాజరుకాగా, జిల్లా నుండి స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# బాధిత కుటుంబానికి అండగా యువజన కాంగ్రెస్

**ఐనవోలు, ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

బాధిత కుటుంబానికి ఐనవోలు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్ అండగా నిలిచారు. ఐనవోలు మండలం పున్నెలు గ్రామంలో ప్రహరీ గోడ కూలి లక్ష్మీకాంతమ్మ (70) మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కే. దిలీప్ రాజ్ ఆదేశాల మేరకు ఐనవోలు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపు రెడ్డి రుగ్వేద్ రెడ్డి, ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాయపురం సాంబయ్య, బొల్ల ఇలయ్య, రావుల రాజు, బొల్ల ఉప్పలయ్య, కత్తి రాజు, చేవ్వ లోకేష్, బొల్లపెల్లి రాజు, ఎల్లందుల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలి....

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**




స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగష్టు, 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు జరుగు వేడుకల సందర్భంగా ముందస్తు ఏర్పాటు చేయాలని డిఆర్ఓ ఆహ్వాన పత్రికలు, స్టాల్స్ డిఆర్డిఏ పిడి, కల్చరల్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ హెల్త్ క్యాంపు పెట్టాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,108 వాహనం అందుబాటులో ఉంచాలని, మున్సిపాలిటీ శాఖ వారు త్రాగు నీరు, శానిటేషన్ చేయాలని ఉపన్యాస ప్రతులు సిపిఓ తయారు చేయాలని, ఫైర్ డిపార్ట్మెంట్ ఫైర్ సేఫ్టీ పరికరాలతో సిద్ధంగా ఉండాలని, నిరంతర ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఎలక్ట్రిసిటీ వాళ్ళు చూసుకోవాలని, డిఇ ఐడపిఆర్ పబ్లిక్ అడ్రస్ సిస్టం, వీడియో కవరేజీ చేయాలని, స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో తప్పనిసరిగా అధికారులు, ఉద్యోగులుపాల్గొనాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, డీఈవో అశోక్ సూర్యాపేట ఆర్డిఓ వేణు మాధవ్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులకు తెలియజేశారు

**జిల్లా యూత్ పార్లమెంట్ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ప్రతిభావంతులను ఎంపిక చేయాలి**

**వికసిత్ భారత్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాల్లో యువతను విస్తృతంగా భాగస్వాములను చేయాలి**

**సూర్యాపేట, ఆగష్టు, 7 నేటి వెలుగు ప్రతినిధి**



కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 8 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని పోస్టర్ ఆవిష్కరణ చేసి జిల్లా అధికారులను సూచించారు. జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. అలాగే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలనిసూచించారు జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పి సీఈవో శిరీష ,జిల్లా యువజన క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి, లీడ్బ్యాంక్ మేనేజర్, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ శశాంక్ , జిల్లా విద్యాధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, మై భారత్ అకౌంట్స్ ఆఫీసర్ కమరతపు భానుచందర్ , ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి, డిఎంహెచ్ఓ., సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండలో ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు..: కొన్ని హాస్పిటల్ సేవలు నిలిపివేతకు ఆదేశాలు:డిఎంహెచ్ఓ రాహుల్.

**నల్గొండ జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

నల్గొండ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, తీవ్ర లోపాలను గుర్తించారు. జిల్లా వైద్య ఉ ఆరోగ్య అధికారి డా. కె. రాహుల్ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ (క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం), హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆర్‌పీ రోడ్డులోని ఒక హాస్పిటల్‌లో తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (నమోదు మరియు నియంత్రణ) చట్టం--2010, నిబంధనలు--2022 ప్రకారం పలు తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించారు. ఆరోగ్యశ్రీ ఎంపానెల్ ఆసుపత్రి అయినప్పటికీ 50 పడకల ఆసుపత్రికి అవసరమైన ప్రమాణాలు పాటించకపోవడం, అర్హత కలిగిన వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది కొరత, రోగుల వైద్య రికార్డుల నిర్వహణలో లోపాలు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి. అంతేకాకుండా రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల కు ప్రాథమిక ఆధారాలు లభించాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం నిర్వహిస్తున్నప్పటికీ, తప్పనిసరిగా ఉండాల్సిన అర్హత కలిగిన రేడియాలజిస్ట్ సేవలు అందుబాటులో లేవని గుర్తించారు. ఈ నేపథ్యంలో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ హాస్పిటల్‌లో ఔట్‌పేషెంట్ (ఓపీ), ఇన్‌పేషెంట్ (ఐపీ), అత్యవసర వైద్య సేవలు, శస్త్రచికిత్సలు సహా అన్ని వైద్య సేవలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. అదేరోజు దేవరకొండ రోడ్డులోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఉదయ్ హాస్పిటల్‌లో అర్హత కలిగిన వైద్యులు లేకుండానే ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు గుర్తించి, వెంటనే మూసివేయాలని ఆదేశించారు. శ్రీ సత్య డెంటల్ క్లినిక్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీ చేయగా, అర్హత కలిగిన వైద్యులు లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఇంకో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డ్యూటీ మెడికల్ ఆఫీసర్ లేకపోవడం, అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది లేకపోవడం, సెల్లార్‌లో ల్యాబొరేటరీ నిర్వహించడం వంటి లోపాలు బయటపడ్డాయి. విజయదుర్గ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ప్రమాణాలు పాటించకపోవడం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. కె. రాహుల్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అధిక ఫీజుల వసూళ్లు, అర్హత లేని సిబ్బందితో వైద్య సేవలు అందించడం, చట్టాలకు విరుద్ధంగా ఆసుపత్రుల నిర్వహణ వంటి ఉల్లంఘనలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం తదితర నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## వరిబదులు.. ఆయిల్‌పామ్ సాగుకు జై!



**వనపర్తి జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

ఆయిల్‌పామ్ పంట ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం లభిస్తుంది ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి -- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రైతు భాను పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరై మొక్క నాటిన కలెక్టర్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రైతు భాను జిల్లా ఉద్యాన శాఖ సహకారంతో తన పొలంలో ఆయిల్‌పామ్ మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రైతు పొలంలో ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఆయిల్ పామ్ మొక్కను నాటి నీరు పోసి, రైతు భానుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం అవసరమని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతు భానును అభినందించిన కలెక్టర్, తన అనుభవాలను ఇతర రైతులతో పంచుకుంటూ ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేయేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, బీవీజీ రామ్‌జీ పథకం కింద వ్యవసాయ రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని సంబంధిత ఎంపీడీవోను ఆదేశించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీ వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, డీ హెచ్ ఎస్ ఓ విజయ్ భాస్కర్, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ లోకా రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా బోనాల వేడుకలు





**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో జరుపుకునే రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పండుగను వేడుకగా జరుపుకున్నారు. పోతరాజులతో కలిసి అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సహంగా నృత్యవిన్యాసాలతో పాటు డప్పు వాయిద్యాల మధ్య భోనాలను కార్యాలయం నుండి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మహిళా సిబ్బంది అత్యంత భక్తి శ్రద్దలతో బోనాలను అమ్మవారికి సమర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలి





**నల్గొండ జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 15 న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ముఖ్య అతిథి సందేశానికై ఈనెల 10లోగా అన్ని శాఖలు నివేదికలను పంపించాలన్నారు. ఈ నెల 11 లోగా ఆయా శాఖల ద్వారా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంసా పత్రాలకు పేర్లను పంపించాలని ,స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయా శాఖలు వారి ప్రగతిని తెలిపేలా ఎప్పటిలాగే శకటాలను ఏర్పాటు చేయాలని , ఆ రోజున స్వతంత్ర దినోత్సవ వేడుకలతో పాటు, సాయంత్రం ఎస్ ఎల్ బి సి లో నూతనంగా నిర్మించిన పెట్రోల్ పంప్ ప్రారంభం, అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రధాన శాఖలు శకటాలను ఏర్పాటు చేయాలని, వేడుకలలో భాగంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, వేడుకలకు హాజరయ్యే వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రోటోకాల్ ను పూర్తిగా పాటించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలనిడీఈఓ ను ఆదేశించారు. జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించే ప్రతి ఒక్కరూ జాతీయ పతాక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్లాస్టిక్ జెండాలను ఉపయోగించవద్దని, డెకరేషన్ కు కూడా ప్లాస్టిక్ వాడ వద్దని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్ఓ దశరథ, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# నల్గొండలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

**పగటిపూటే తాళం వేసిన ఇళ్లే లక్ష్యం..**

**ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ అరెస్టు రూ.3.25 లక్షల నగదు, స్కూటీ స్వాధీనం..**

**పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు.. అడిషనల్ ఎస్పీ జి.రమేష్**

**నల్గొండ జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి :**

పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును నల్గొండ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదుతో పాటు స్కూటీ, చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. శుక్రవారం నల్గొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సిసి కెమెరాల ఆధారంగా చిక్కిన దొంగ..

గత నెల 26న నల్గొండ పట్టణంలోని వి.టి. కాలనీకి చెందిన ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటనపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో (క్రైమ్ నెం. 286/2026, యు/ఎస్ 331(3), 305(అ) బిఎన్ఎస్) కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. ఆగస్టు 6న సాయంత్రం 5 గంటల సమయంలో పానగల్ బైపాస్ రోడ్డు వద్ద స్కూటీపై మళ్లీ చోరీకి యత్నిస్తున్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ (48) (స్వస్థలం భజన్‌పురా, నార్త్ ఈస్ట్ ఢిల్లీ)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నల్గొండ వన్‌టౌన్, టూటౌన్ పరిధులతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెం, తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు.

ముఠా పనిచేసే తీరు ఇదిగో..

ముందుగా తాళం వేసిన ఇళ్లను గుర్తించి రెక్కీ నిర్వహించడం ఈ ముఠా శైలి. ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక, పగటి పూట ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి క్షణాల్లో నగలు, నగదుతో పరారయ్యేవారు. జులై 26న ప్రధాన నిందితుడు నసీమ్, సహచరుడు ఇర్షాద్ స్కూటీపై రాగా, షరీఫ్ అనే వ్యక్తి కారులో వచ్చి బయట కాపలా కాశాడు. ఈ ముగ్గురు కలిసి నల్గొండ వన్‌టౌన్ పరిధిలోని రెండు ఇళ్ల తాళాలు తీసి 5 తులాల బంగారం, రూ.30,000 నగదు, టూటౌన్ వి.టి.కాలనీలో 3 తులాల బంగారం దోచుకెళ్లారు. నెల్లూరు జిల్లా వేదాయపాలెంలో 24 తులాల



బంగారం, 3 కిలోల వెండి.. తిరుపతి జిల్లా తిరుచానూరులో 9 తులాల బంగారం, 15 తులాల వెండిని దోచుకున్నట్లు తేలింది.

ఎన్నో క్రిమినల్ కేసులు,చర్లపల్లి జైలు శిక్ష కూడా..

ప్రధాన నిందితుడు నసీమ్ పాత నేరస్థుడు. గతంలో ఢిల్లీ, ఇండోర్ (మధ్యప్రదేశ్), మీరట్ (యుపి)లలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై వచ్చాక, ఢిల్లీలో నిఘా పెరగడంతో హైదరాబాద్ వచ్చి రాయదుర్గం, ఉప్పల్, మల్కాజిగిరి పరిధిలో వరుస దొంగతనాలు చేశాడు. ఈ కేసుల్లో రెండేళ్లపాటు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి, మూడు నెలల క్రితమే విడుదలయ్యాడు. ప్రస్తుతం అత్తాపూర్‌లో అద్దెకు ఉంటూ మళ్లీ పాత దందాను మొదలుపెట్టాడు. కేసులో పరారీలో ఉన్న మిగతా ఇద్దరు నిందితులు ఇర్షాద్, షరీఫ్‌ల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని అడిషనల్ ఎస్పీ తెలిపారు. డిఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో కేసును వేగంగా ఛేదించిన వన్‌టౌన్ సీఐ ఎ.రాజశేఖర్ రెడ్డి, టూటౌన్ సీఐ కె.ఆది రెడ్డి, ఎస్ఐలు డి.సైదబాబు, ముత్తయ్య, జి.మానస, సిబ్బంది రబ్బాని, శంకర్, అంజద్, బాలకోటి, షకీల్, జానకి రాములు, హోంగార్డు శ్రీనులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి -- ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం






**కట్టంగూర్ రూరల్ ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మనం పేపర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సయ్యద్ ను సన్మానించిన ఎడిటర్ రమేష్

**నల్లగొండ జిల్లా ఆగస్టు 7 నేటి వెలుగు ప్రతినిధి**

హైదరాబాద్‌లో శుక్రవారం మనం పేపర్ నల్గొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎం.డి. సయ్యద్ ని విధి నిర్వహణలో చూపుతున్న నిబద్ధత, వార్తల సేకరణలో ప్రతిభ, సంస్థ అభివృద్ధికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనం పేపర్ ఎడిటర్ రమేష్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో పనిచేస్తూ పత్రికకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మనం పేపర్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్ , ఇతర ప్రతినిధులు, సిబ్బంది పాల్గొని ఎం.డి. సయ్యద్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**